గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

శంషాబాద్: పట్టణంలోని సాతంరాయిలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల డిగ్రీ (పురుషుల) కళాశాలలో ఆంగ్ల భాష బోధించేందుకు గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రాంతీయ సమన్వయాధికారి రాజేష్ తెలిపారు. ఔత్సాహిక అభ్యర్థులు యూజీసీ నిబంధనల మేరకు అర్హతులు ఉండాలన్నారు. నెట్, స్లెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి అధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. వివరాలకు ఫోన్: 94909 55172లో సంప్రదించాలన్నారు.

ఓటరు జాబితా ప్రదర్శన


ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ మున్నీ

శంషాబాద్ రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహాల్లో భాగంగా మండల పరిధిలోని పంచాయతీ వార్డుల వారీగా ఓటరు జాబితా, పోలింగ్ స్టేషన్‌ల వివరాలను గురువారం ప్రదర్శించారు. మండల పరిషత్ కార్యాలయంతో పాటు, ఆయా పంచాయతీ కార్యాలయాల వద్ద ఈ జాబితాను అందుబాటులో పెట్టినట్లు ఎంపీడీఓ మున్నీ తెలిపారు. వీటిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు మండల పరిషత్ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

పలు అంశాలపై అవగాహన


వివిధ రాష్ట్రాల వస్త్రధారణలో విద్యార్థులు

శంషాబాద్ రూరల్: మండలంలోని మల్కారంలో సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థులు గురువారం పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కుటుంబ వ్యవస్థపై నాటిక ప్రదర్శనతో అవగాహన కల్పించారు. కుటుంబీకుల పాత్ర, బాధ్యతలను వివరించారు. వివిధ రాష్ట్రాల ప్రజల వస్త్రధారణను ప్రదర్శించారు.

బతుకమ్మ సంబరాలు షురూ


బతుకమ్మ ఆడుతున్న మహిళలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో బతుకమ్మ సంబరాలు ప్రారంభమయ్యాయి. నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో వినాయక చవితి రోజు నుంచి మహిళలు, యువతులు, చిన్నారులు బతుకమ్మ ఆటలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఆనవాయితీని ఇప్పటికీ నియోజకవర్గ ప్రజలు కొనసాగిస్తున్నారు. గణనాథుని ప్రతిష్ఠాపన కార్యక్రమాలు బుధవారం రాత్రి పూర్తయిన అనంతరం మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మలు ఆడుతూ పాడుతూ ఉత్సవాలను ప్రారంభించారు. గణేశ్ మండపాలతో పాటు తమ ఇళ్ల వద్ద ఈ బతుకమ్మ ఆటలను మహిళలు, పిల్లలు ఆడుతూ ఎంజాయ్ చేశారు. బతుకమ్మ ఆటలను దసరా వరకు కొనసాగించనున్నారు.


కాటేదాన్‌లో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి


ఎర్రకుంటతండాలో...


జూకల్‌లో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి...


శివనగర్‌కాలనీలో నవయువ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

జై బోలో గణేశ్ మహరాజ్‌కీ

మణికొండ: వినాయకచవితి నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. గణేశ్ చతుర్థి సందర్భంగా బుధవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని బస్తీలు, కాలనీలు అనే తేడా లేకుండా వాడవాడలా గణనాథుల విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం రెండవ రోజు పూజలను కొనసాగించారు. నియోజకవర్గం పరిధిలోని మణికొండ, నార్సింగి, శంషాబాద్ మున్సిపాలిటీలు, బండ్లగూడ కార్పొరేషన్, జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఐదు సర్కిల్‌లు, శంషాబాద్ మండలంలోని గ్రామపంచాయతీల పరిధిలో కాలనీలు, కూడళ్లు, అపార్ట్‌మెంట్‌లు, దేవాలయాలు, గేటెడ్ కమ్యూనిటీలలో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద భక్తి శ్రద్ధతో పూజలు నిర్వహించారు. ఆయా మండపాల వద్ద ప్రత్యేక పూజలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయా మండపాలలో నిర్వహించిన పూజలలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు, వినాయక మండపాల నిర్వాహకులతో పాటు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


శంషాబాద్ బృందావన్ కాలనీలో...


గణేష్‌నగర్‌లో గణనాథుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్


ఖానాపూర్‌లో గుడిమల్కాపూర్ మార్కెట్ చైర్మన్ మల్లేష్...


విజయగణపతి ఆలయంలో ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్


హైదర్‌గూడ బాబు జగ్జీవన్‌రామ్ యూత్ అసోసియేషన్..


పుప్పాలగూడలో మణికొండ మున్సిపల్ మాజీ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్


శంషాబాద్ వివేకానంద కాలనీలో పర్యావరణ గణపతి


కిస్మత్‌పూలో బీజేపీ నేతలు


అత్తాపూర్ రఘువీర భక్త సమాజం...


నార్సింగిలో కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్‌యాదవ్...


నేతాజీ యూత్ అసోసియేషన్...


మాజీ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి...


శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో...


ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో...


మణికొండ స్వర్ణ ప్యాలెస్‌లో...


మార్కండేయనగర్‌లో మహిళలు

ఆలయానికి హనుమాన్ విగ్రహం తరలింపు

మణికొండ: ఎలాంటి పూజలకు నోచుకోకుండా నిర్మానుష్య ప్రదేశంలో ఉన్న హనుమాన్ విగ్రహాన్ని పోచారం గుట్ట దేవాలయానికి తరలించారు. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో ప్రధాన రోడ్డు పక్కన నిర్మానుష్యంగా ఎవరికీ కనిపించకుండా ఓ హనుమాన్ విగ్రహం ఎప్పటి నుంచో ఓ చెట్టు కింద ఉంది. అక్కడ ఎవరూ ఎలాంటి పూజలు నిర్వహించకపోవటంతో అది నిరాదరణకు గురయ్యింది. గతంలో అదే స్థలంలో రాతి విగ్రహాలను చెక్కే శిల్పి విగ్రహాలను చెక్కి విక్రయించేవారు. వారు అక్కడి నుంచి వెళ్లిపోయే సమయంలో మిగతా అన్ని విగ్రహాలను తీసుకెళ్లినా ఆంజనేయ స్వామి విగ్రహాన్ని అక్కడే ఉంచారని గ్రామస్థులు తెలిపారు. దాంతో సంవత్సరాల పాటు ఆ విగ్రహం పూజలకు నోచుకోకుండా ఉన్న విషయాన్ని గమనించిన గ్రామ హనుమాన్ భక్తులు బుధవారం క్రేన్ సాయంతో దాన్ని సమీపంలో ఉన్న పోచారం గుట్ట హనుమాన్ దేవాలయానికి చేర్చారు. ప్రవేశంలో ఉన్న వినాయకుడి విగ్రహం పక్కనే ఏర్పాటు చేశారు. రాబోయే రోజుల్లో నిత్య పూజలను అందిస్తామని భక్తులు తెలిపారు.


పోచారం గుట్ట హనుమాన్ దేవాలయ ఆవరణలో ఆంజనేయ స్వామి విగ్రహం

ఈసీ వాగులో ప్రమాదకరంగా నిమజ్జనాలు

అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి

రాజేంద్రనగర్: బుద్వేల్ ఈసీ వాగులో ప్రజలు ప్రమాదభరితంగా గణేష్ నిమజ్జన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఉత్సవాల సందర్భంగా తమ ఇళ్లల్లో ప్రతిష్ఠించిన గణనాథులను ప్రజలు గురువారం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి నిమజ్జనాలకు తరలించారు. చిన్ని పిల్లలతో పాటు పెద్దలు తమ ఇళ్లల్లో ప్రతిష్ఠించిన గణనాథులను ఈ వాగులోకి తీసుకొచ్చి ఉదయం నుంచి రాత్రి వరకు నిమజ్జనం చేశారు. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో హిమాయత్‌సాగర్ మూడు గేట్లను తెరిచారు. ఈ వరదనీటితో ప్రస్తుతం వాగు పొంగిపొర్లుతుంది. బుద్వేల్ నుంచి కిస్మత్‌పూర్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో గతంలో బ్రిడ్జిని నిర్మించారు. ఈ బ్రిడ్జి పై నుంచి ప్రస్తుతం వరదనీరు ప్రవహిస్తుంది. వీటిపై రాకపోకలను గతంలోనే మూసివేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన బ్రిడ్జి నుంచి రాకపోకలు సాగుతున్నాయి. పాత బ్రిడ్జి పైనుంచి స్థానిక ప్రాంతాలకు చెందిన ప్రజలు గణేష్ విగ్రహాల నిమజ్జనాన్ని కొనసాగిస్తున్నారు. వరదనీటిలోకి దిగి సెల్ఫీ దిగుతూ చిన్న పిల్లలతో నిమజ్జనాలు చేయిస్తున్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగకముందే ఈ ప్రాంతంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అటు హైదరాబాద్ జీహెచ్‌ఎంసీ... ఇటూ బండ్లగూడ కార్పొరేషన్ అధికారులు స్పందించి తగు నిమజ్జన ఏర్పాట్లు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


ప్రమాదకరంగా సెల్ఫీలు తిరుగుతూ వినాయక నిమజ్జనాలు చేస్తున్న ప్రజలు

గండిపేటకు భారీగా వరద

- పూటపూటకూ పెరిగిన నీటి మట్టం
- సాయంత్రానికి 8 గేట్లు ఎత్తిన అధికారులు
- ఇన్‌ఫ్లో 900 క్యూసెక్కులు
- అవుట్ ఫ్లో 2704 క్యూసెక్కులు

మణికొండ: గండిపేట (ఉస్మాన్‌సాగర్) చెరువు పరీవాహక మండలాలైన శంకర్‌పల్లి, మొయినాబాద్, నవాబ్‌పేట్, వికారాబాద్ మండలాలలో బుధవారం కురిసిన భారీ వర్షానికి భారీ వరద రావటంతో నీటి మట్టం పెరిగింది. పూర్తి స్థాయి నీటి మట్టం 1790 అడుగులకు గాను 1789.85కు చేరుకుంది. దాంతో అప్రమత్తమైన జలమండలి అధికారులు అప్పటికే తెరచి ఉన్న రెండు గేట్లతో పాటు ఉదయం మరో రెండు గేట్లు, సాయంత్రం 4 గంటలకు మరో రెండు గేట్లు, 5 గంటలకు మరో రెండు గేట్లతో మొత్తం 8 గేట్లను తెరిచారు. మొత్తం ఎనిమిది గేట్లను 3 అడుగుల మేర ఎత్తి సాయంత్రం 5 గంటలకు 2704 క్యూసెక్కుల నీటిని మూసీనదికి వదిలారు. పై నుంచి 900 క్యూసెక్కుల వరద చెరువులోకి వస్తుందని, రాత్రికి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని జలమండలి, రెవెన్యూ అధికారులు తెలిపారు. గండిపేట చెరువు 8 గేట్లను మూడు అడుగుల మేర ఎత్తటంతో మూసీ నదికి వరద పెరగటంతో నదీ పరీవాహక ప్రాంత గ్రామాలు, కాలనీలను పోలీసులు, జలమండలి, రెవెన్యూ అధికారులు అప్రమత్తం చేశారు. నార్సింగి మున్సిపల్ కేంద్రం నుంచి మంచిరేవులకు వెళ్లే దారిలో ఉన్న లో లెవల్ వంతెనపై నుంచి నీటి ప్రవాహం కొనసాగుతుండటంతో రాకపోకలను నిలిపివేశారు.


మంచిరేవుల వంతెన పై నుంచి వెళ్తున్న వరద

మంచిరేవులకు రాకపోకలు బంద్

మణికొండ: భారీ వర్షం నేపథ్యంలో మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని లోతట్టు ప్రాంతాలలో వరద నీరు నిలిచింది. గండిపేట చెరువు పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకుని పై నుంచి మరింత వరద వస్తుండటంతో గురువారం సాయంత్రం 8 గేట్లను మూడు అడుగుల మేర తెరచి 2704 క్యూసెక్కుల నీటిని మూసీనదిలోకి వదిలారు. దాంతో నార్సింగి మున్సిపాలిటీ కేంద్రం నుంచి మంచిరేవులకు వెళ్లే రోడ్డులో ఉన్న లోలెవల్ వంతెన పై నుంచి నీటి ప్రవాహం కొనసాగుతుండటంతో నార్సింగి పోలీసులు ఇరువైపులా బారి కేడ్లు ఏర్పాటు చేసి రోడ్డును మూసివేశారు. దాంతో మంచిరేవుల వాసులు నార్సింగికి వచ్చేందుకు ఔటర్ సర్వీసు రోడ్డు ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. బుధవారం కురిసిన భారీ వర్షానికి మణికొండ మున్సిపాలిటీ శ్రీరాంనగర్ కాలనీలో పలు చోట్ల చెట్లు విరిగి రోడ్లపై పడ్డాయి. వాటిని విద్యుత్, మున్సిపల్ సిబ్బంది ముక్కలుగా చేసి తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. పలు కాలనీలలో విద్యుత్ సరఫరాకు అంతారాయం కలగటంతో సిబ్బంది సరఫరాను పునరుద్ధరించారు.


శ్రీరాంనగర్ కాలనీలో కూలిన చెట్టు


గండిపేట చెరువు నుంచి మూసీలోకి నీరు

వర్షాలతో ఇక్కట్లే పరిమితం

శాస్త్రీపురం: రెండు రోజులుగా కురుస్తున్న వానలతో శాస్త్రీపురం, సులేమాన్‌నగర్ డిజన్‌ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చింతల్‌మెట్, వాదియామహ్మద్ కాలనీ, హసన్‌నగర్, ఇంద్రానగర్, మీరాలంచెరువు, శాస్త్రీపురం, కింగ్స్‌కాలనీ, ఎంఎం పహాడీ, నౌనంబర్, అహ్మద్‌నగర్ ప్రాంతాలలో వర్షపు నీరు రోడ్లపై నిలిపోయింది. గురువారం వాన కొద్దిగా విరామం ఇవ్వడంతో జీహెచ్‌ఎంసీ సిబ్బంది వరద నీటి తొలగింపు చర్యలు తీసుకున్నారు. చాలా చోట్ల మ్యాన్‌హోళ్లతో చేరిన మట్టిని తొలగించి నీరు సాఫీగా వెళ్లేలా తీశారు. మరికొన్ని ప్రాంతాల్లో రహదారులపైకి కొట్టుకొచ్చిన మట్టిని తొలగించారు.

చెరువుల్లో వ్యర్థాల తొలగింపు

రాజేంద్రనగర్: గణేశ్ నిమజ్జనోత్సల నేపథ్యంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని చెరువుల్లో పేరుకుపోయిన చెత్త ఇతర వ్యర్థాల తొలగింపు ప్రక్రియ ప్రారంభమైంది. నియోజకవర్గంలోని పల్లె చెరువు, పత్తికుంట, కాముని చెరువు, నెక్నాంపూర్ చెరువులలో నిమజ్జనానికి పెద్ద ఎత్తున గణనాథులను తీసుకొస్తుంటారు. నెక్నాంపూర్, రాజేంద్రనగర్‌లో గతంలో నిర్మించిన ప్రత్యేక కొలనులలో నిమజ్జనం కోసం తగు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. పత్తికుంట, పల్లెచెరువులలో పేరుకుపోయిన గుర్రపు డెక్కలను మూడు రోజులుగా జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో సిబ్బంది తొలగిస్తున్నారు. గురువారం సాయంత్రానికి ఈ పనులు ముమ్మరమయ్యాయి. శుక్రవారం నిమజ్జన కార్యక్రమాలు ఉండటంతో పెద్ద ఎత్తున పనులు చేపడుతున్నారు.


పత్తికుంటలో గుర్రపు డెక్కలను తొలగిస్తున్న సిబ్బంది

విద్యుత్ పోరాట అమరవీరులకు నివాళి


కాటేదాన్ చౌరస్తాలో నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు


మణికొండలో నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

మైలార్‌దేవ్‌పల్లి: కాటేదాన్ చౌరస్తాలో విద్యుత్ పోరాట అమరవీరులకు సీపీఎం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలను ఏర్పాటు చేసి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీపీఎం రాజేంద్రనగర్ మండల కమిటీ సభ్యులు బచ్చలకూర స్వామి, పి.సి.కె.భాస్కర్ మాట్లాడుతూ... విద్యుత్ పోరాటంలో అసువులు బాసిన అమరవీరులు రామకృష్ణ, విష్ణువర్ధన్, బాలస్వామి త్యాగం మరువలేనివన్నారు. 2000 ఆగస్టు 28వ తేదీన బషీరాబాగ్ కాల్పుల్లో మరణించిన ఉద్యమ పోరాట యోధులను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. పేద ప్రజలను దోపిడీకి గురి చేసే ప్రభుత్వ విధానాలను వామపక్షాలు ఐక్యంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. సీపీఎం రాజేంద్రనగర్ మండల నాయకులు ప్రవీణ్, సచిన్, శశికాంత్, దత్తు, శ్రీనివాస్, సాయి, జాంగిర్ తదితరులు పాల్గొన్నారు.

మణికొండలో...

మణికొండ: పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా 2000 ఆగస్టు 28వ తేదీన జరిగిన కాల్పులలో వీరమరణం పొందిన అమరులకు సీపీఐ నాయకులు గురువారం నివాళులు అర్పించారు. మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలో సీపీఐ జెండాను ఆవిష్కరించి అమరులకు సంతాపం తెలిపారు. సీపీఐ మండల కార్యదర్శి ఎస్. మల్లేష్, నాయకులు ఎం.శంకరయ్య, ఎం.బాబురావు, డి.శ్రీనివాస్, రాములు గౌడ్, నాయక్, శ్రీను. శంకర్, వెంకన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.